

# అమెరి "కలగూరగంప" కామెడి

## వంగూరి చిట్టెన్‌రాజు



### కుక్కా, కుక్కా, నడుమ నేనూ

16

**అప్పుడెప్పుడో కొన్ని దశాబ్దాల క్రితం మాట.** అప్పటికి వారం ముందే అమెరికానుంచి ఆంధ్రా వెళ్ళాను. అమెరికా దొరగారు మంజూరు చేసిన పన్నెండు రోజుల శలవు అయిపోకముందే అర్జంటుగా పెళ్ళి చేసేసుకోవాలి కదా! ఎంత తొందర అయితే మటుకు, నేను ఎంత వెర్రి వెధవని కాకపోతే, మా మామగారు వేసిన వలలో పడిపోయి, ఆ ఒకానొక ఏప్రిల్ ఒకటి నాడు..అవును..."ఏప్రిల్ ఫూల్ దివసం" నాడు... కాస్త అయినా ఆలోచించకుండా పెళ్ళి చూపులకి ఒప్పేసుకోవడం ఏమిటీ? ఒప్పుకుంటిని బో, మరొక పది రోజులకి ఆవిణ్ణే  అసలు, సిసలు పెళ్ళి కూడా చేసేసుకోవడం ఏమిటీ? చేసుకుంటిని బో, ఆ తర్వాత గట్టిగా ఏడాది తిరగ్గానే మళ్ళీ వచ్చిన ఏప్రిల్‌లోగానే ఈ పెళ్ళి అనే తతంగం నా అంతటి వాడిని కూడా ఎంత "ఫూల్" ని చేసేస్తుందో తెలుసుకోవడం ఏమిటీ? "ఇదంతా ఆ బెగమంతుడి లీల" అనుకోవడం సులభమే కానీ, మా పెళ్ళి చూపుల టాపిక్కూ, ఆ తర్వాత పెళ్ళి రూపేణా జరిగిన పెర్మనెంట్ డేమేజీ గుర్తుకొచ్చినప్పుడల్లా "నీ మొహం, నువ్వే ఆ రోజు ఆ వెధవ అమెరికా రంగుల చొక్కా వేసుకుని నన్ను ఫూల్‌ని చేశావు. పైగా మెడలో మీ అమ్మ తాలూకు బంగారం గొలుసూ, పర్సులో నాలుగు క్రెడిట్ కార్డులూ చూపెట్టి మా నాన్నని కూడా ఏప్రిల్ ఫూల్‌ని చేశావు. పాపం, అన్ని క్రెడిట్ కార్డులుంటే అమ్మ బాబోయ్, ఎంత డబ్బున్న వాడోయ్ అనుకుని సంతోషంగా గెంతులేశాడు కానీ, ఒక్కో కార్డు మీదా వేల కొద్దీ అప్పులున్నాయి అని అనుకోలేదు ఫాపం  మా నాన్న" అంటూ అప్పుడప్పుడునూ, ఖచ్చితంగా ప్రతీ ఏడూ ఏప్రిల్ నెలంతటా ఇప్పటికీ కళ్ళమ్మట నీళ్ళు పెట్టుకుంటూ ఉంటుంది మా క్వీన్ విక్టోరియా. ఏప్రిల్ నెలకి అంత ప్రాముఖ్యత ఎందుకంటే....దానికి కనీసం నాలుగు కారణాలు ఉన్నాయి. వాటిల్లో రెండు కారణాలు..అనగా మా పెళ్ళి చూపులూ, మరియు వైజాగ్ మహారాణీ పేటలో "ఆపోజిట్ కేజీహెచ్ ఓపీ గేట్" ముందు జరిగిన మా వివాహోత్సవాలూ ఏప్రిల్ నెలలోనే జరిగాయి.

ఇక మిగిలిన ఏప్రిల్ ఘట్టాలకి కొన్ని దశాబ్దాల ముందు మరొక ఏప్రిల్ నెల ఆఖరి వారంలోకి వెనక్కి వెళ్ళిపోవాలి... అప్పుడేమయిందిటంటే, కాకినాడలో ఒంటి మామిడి చెట్టుకి అసింటా పార్కుకీ, గాంధీ బొమ్మకి మధ్యలో మా ఇంట్లో ఉండే పురిటి గది నుంచి కెవ్వున కేక, తరవాత ఓ ఏడుపు వినపడ్డాక "మరో సత్తర కాయ" అని మా ఆస్థాన మంత్రసాని ఎరకల సత్తెమ్మ గొంతుకా వినపడ్డాయిట. ఆ కెవ్వున కేక మా అమ్మది అనియూ, ఆ ఏడుపు నాది అనియూ చాలా మంది అపోహ పడతారు. కానీ ఆ కెవ్వున కేక "వచ్చేశా, వచ్చేశా" అని గుండమ్మ కథలో రాజనాలలాగా నా సొంత డైలాగు అనియూ, ఆ శోకం "అయ్యో, అయ్యొయ్యో ఏమి సేతురా లింగా, ఈ వెధవతో ఏమి సేతురా లింగా?" అని మా అమ్మ గొంతుకా అనియూ,  ఆ సత్తరకాయ గాడే దడిగాడు వానసిరా

అనియూ, అందు వలన ఈ ఏప్రిల్ నెలలోనే నా పుట్టిన రోజు అనియు మేధావులందరూ ఊహించే ఉంటారు. ఇక్కడ సమస్య ఏమిటంటే, నేను చంటి వెధవ స్థాయి నుంచి పెరిగి పెద్ద "వెధవ" స్టేటస్‌కి వచ్చాక ..అనగా "ఫూల్" అయ్యాక...కథలూ, కాకరకాయలు వ్రాస్తూనో, విరాళాలు సేకరిస్తూనో, నా గాఢమిత్రులూ-గూఢ శత్రువుల నిగూఢ ప్రచారం వలనో, ఏదో ఒక కారణానికి గొప్పవాణ్ణి అయిపోయాను అని నేను అనుకుంటాను కదా! అందు వలన స్వస్తిశ్రీ చాంద్రమాన సంవత్సర బహుళ....వగైరా ..అనగా ఏప్రిల్ 29 సాయంత్రం సూర్యాస్తమయానంతరం వర్జ్యమూ, దుర్మూహూర్తమూ కలిసిన ఆరు ఘడియల నాలుగు విఘడియల సకల దౌర్భాగ్య ముహూర్తాన నేను పుట్టాను అని చాలా మందికి "వరల్డ్ ఫేమస్ తెలుగు ఫూల్స్" అనే గూగుల్ సెర్చ్ ద్వారానూ, "మీరు ఎక్కడి నుంచి వచ్చారో తెలుసుకోండి" లాంటి "కుటుంబ చెట్టు" అనగా "ఫేమ్లీట్రీ" వెబ్ సైట్స్ ద్వారానూ తెలిసిపోయింది. దాంతో అప్పటికి సరిగ్గా పది రోజుల ముందు నుండీ, ప్రతీ ఏడూ, నన్ను అరక్షణంలో అరడజను గ్రీటింగ్స్ పంపించగలిగే వెబ్ సైట్స్ వాళ్ళు తగులుకుంటారు. దాని పర్యవసానం మరికొన్ని సార్లు క్వీన్ విక్టోరియా కన్నీళ్ళు కార్చుట.

ఉదాహరణకి " " అనే ఒకానొక "తెలుగు" వెబ్ సైట్ వారి ధర్మమా అని "హేపీ భర్త డే, మీకు నా సుబాకాంక్సలు" అని ధనలక్ష్మి ఫ్రం దానవాయి పేట నుంచి నాకు వచ్చిన గ్రీటింగ్స్ చూడగానే, ఆ రోజు ఎవరి భర్త శ్రాద్ధమో తెలియక "ఇలాంటివి కూడా ఈ మెయిల్‌లో పంపించుకుంటారా?" అని మా క్వీన్ విక్టోరియా కళ్ళమ్మట నీళ్ళు పెట్టుకుంది.

మరొక ఆవిడ "హేపీ బార్ డే" అని తన ఇంట్లో సరదాగా తీసిన యూట్యూబ్ లింక్ పంపించింది....గాలి బుడగలూ, ఊదొత్తులూ, మరియూ వెనకాల నా ఫొటోతో సహా.

"ఈ బార్ డే ఏమిటీ....అసలు నీకూ ఆవిడకీ ఈ యూట్యూబ్ లింకేనా..ఇంకేమన్నా తాగుబోతు లింకులున్నాయా?" గర్జించింది మహారాణి.

"అమ్మా, తల్లీ, ఆవిడ నాకు పంపించింది నా పుట్టిన రోజు శుభాకాంక్షలు....అనగా టీవీ యాంకర్ బాస లో "బర్ డే" అనమాట....అని చెప్పలేక చచ్చాను. అప్పుడు మళ్ళీ ఆవిడ కన్నీళ్ళు పెట్టుకుంది. ఈ కన్నీళ్ళు "ఎందు వలన , ఓ లలనా ఎందు వలనా" అని నేను లాలనగా అడగ్గానే "నీ మొహం, నువ్వే ఆ రోజు ఆ వెధవ అమెరికా రంగుల చొక్కా వేసుకుని నన్ను ఫూల్ ని చేశావు. పైగా మెడలో మీ అమ్మ తాలూకు బంగారం గొలుసూ, పర్సులో ...... " అనే డైలాగు మళ్ళీ వినపడి, ఏప్రిల్ నెలకీ, నాకూ, మా ఆవిడ కన్నీళ్ళకీ ఉన్న అవినాభావ సంబంధం అర్థం నాకు అయిపోయింది.

ఇప్పుడు అప్పటినుంచి ఫాస్ట్ ఫార్వర్డ్ చేసేసి మళ్ళీ కొన్ని దశాబ్దాలు ..అంటే ఈ ఏడు అనగా ఏప్రిల్, 2012 నెలకి వెళ్దాం అనుకోండి. నాందీ ప్రస్తావనగా ఒక చిన్న పిట్ట కథ ఎమిటంటే.... "నారీ, నారీ నడుమ వయారీ" అనో "నారీ, నారీ నడుమ మురారీ" అనో మా చిన్నప్పుడు సినిమా పాటలు విన్నట్టు గుర్తు నాకు. ఇందులో మొదటి దానికి అర్థం బహుశా ఏ నారికైనా నడుమన ఉండే నడుము వయ్యారంగా ఉంటుందని కవి భావన అయితే, రెండో దాని అర్థం ఆ శ్రీ కృష్ణుల వారు రాధకీ, మరొక గోపికకీ చిక్కుకున్నాడని ఒరిజినల్‌గా పురాణాల్లో ప్రవచించారు. మరింత పుంజుకుని సావిత్రికీ, జమునకీ మధ్యలో నాగేస్సరావును పెట్టేసి మన తెలుగు సినిమా వారు ముగ్గురికీ డాన్సులూ, పాటలూ కూడా పెట్టేశారు. ఇద్దరు అమ్మాయిల మధ్య ఇరుక్కుని అందులో ఒక అమ్మాయి బావ మరిది చేత కాళ్ళు విరక్కొంటించుకునే మహత్ భాగ్యం కొందరు హీరోలది అయితే, మరి నా జాతకం ఏమిటో తెలియదు కానీ, నేను ఈ నెల..అనగా ఏప్రిల్ 2012లో ఒకానొక దుర్మూహూర్తాన ముహూర్తాన ఒక తెల్ల కుక్కా, మరొక నల్ల కుక్కా మధ్య ఇరుక్కుని అటు నృత్యమూ, ఇటు హాహాకారమూ చేస్తూ దొరికి పోయి, కాలు విరక్కొంటించుకున్నాను.

ఇంతకీ జరిగిన సంగతి ఏమిటంటే.....ఆరు నెలల క్రితం మా అబ్బాయి "డాడీ, సమ్మర్ శలవులు బోరుకొడుతున్నాయి. మొన్ననే నా ఫ్రెండ్ జానీ కార్సన్ గాడి కుక్క అరడజను పిల్లలని కని పారేసింది. అందులో సరదాగా ఓ కుక్క పిల్లని తెచ్చుకుని పెంచుకుంటానూ"

అని అరగంటకి ఒక సారి ఆరు రోజులు నసిగాడు. ఆ నసుగుడు భరించలేక "సరేలే, అఘోరించు" అని అచ్చ తెలుగులో అంగీకరించాను. ఆ క్షణంలోనే, ఎక్కడి నుంచో ఆ కుక్క పిల్ల నా ఒళ్ళో వాలిపోయింది. "అయ్యో, బుజ్జిముండ" అనుకుని నా జన్మలో మరొక పొరపాటు చేశాను. అప్పుడు దాని వయసు ఆరు రోజులు. బరువు ఆరు కిలోల కంటే తక్కువ. ఇంకా మొరగడం, కరవడం లాంటి కుక్క బుధ్ధులు లేవు. ఆరు నెలల తరువాత...యస్....యస్.. ఏప్రిల్ నెల ప్రవేశించగానే.....సీజను మారిపోయింది...ఆరు కిలోల కుక్క పిల్ల ఆరు రెట్లు పెరిగింది. ఆ శునక రాజమునకు మెడలో రజము..అనగా తాడు వేసి, "హియర్ యు గో" అంటూ దాన్ని అన్ని రోడ్లూ తిప్పే బాధ్యత నా అంతటి వరల్డ్ పేమస్ "వెధవ" లేదా "ఫూల్"కి అప్పగించి మా అబ్బాయి బేస్కెట్ బాల్ ఆడుకోడానికి పారిపోయాడు. "ఆఫ్టాల్, అలనాడు ధర్మరాజు వెంట వెడలిన కుక్క లాంటిదియే కదా" అని తలచి నేను పెద్ద పోటుగాడిలా "బ్రూక్లిన్" అనబడే మా తనయుడి కుక్క రాజముని తాడుతో లాక్కుంటూ స్వస్తిశ్రీ చాంద్రమాన సంవత్సర బహుళ....వగైరా ..అనగా ఏప్రిల్ 12, 2012 నాడు సాయంత్రం సూర్యాస్తమయానంతరం వర్జ్యమూ, దుర్ముహూర్తమూ కలిసిన ఆరు ఘడియల నాలుగు విఘడియల సకల దౌర్భాగ్య ముహూర్తాన నడిపించుకుంటూ వెడుతూండగా...ఒకానొక అమెరికా తెల్ల వనిత....నన్ను పలకరించింది. "నువ్వు కుక్కని వాక్‌కి తీసుకెడుతున్నావా? లేక ఆ కుక్కయే నిన్ను ముందు ఉండి నడిపిస్తోందా?" అని ఆవిడ ప్రశ్న. అంటే, ఈ తెల్ల పిల్ల, నన్నూ, మరియూ మా కుక్క పిల్ల పొజిషనూ గమనించి అడిగిన ప్రశ్న అనమాట. పైగా ఆ వెధవ..యస్..ఫూలిష్ నవ్వు ఒకటి!.

ఇంతలో, హఠాత్తుగా ఆ తెల్లపిల్ల తాలూకు తెల్ల కుక్క, నా తాలుకు నల్ల కుక్కపై దాడి చేయుట, లేదా ప్రేమగా పలకరించుట, నేను..యస్...యస్..వెర్రి వెధవ వలె...ఆ తెల్ల పిల్లనే చూసి పరవసిస్తూ ...కుక్కల మాట మరచుటా అంతా క్షణంలో జరిగి, ఈ రెండు కుక్కల అంతరంగ తతంగంలో "కుక్కా, కుక్కా, నడుమ వంగూరీ" లా ఇరుక్కుని దిక్కు తెలియని పరిస్థితిలో ఢబీ మని కింద పడుటా, కుక్కలూ "వీడు నా వాడు, ఆవిడ నా తాలూకు" అని పోటీలు పడి నన్ను మళ్ళీ, మళ్ళీ ఢబీ మని క్రింద పడవేయుటా....నా లాంటి ఫూల్ కాని ఆ తెల్లపిల్ల ఆవిడ కుక్క తాలూకు తాడుని ఠపీమని వదలివేసినా, నేనూ మటుకు ఏప్రిల్ ఫూల్‌లా మా కుక్క తాలూకు తాడు వదలి పారిపోకుండా వెర్రి వెధవలా పట్టుకుని వేళ్ళాడుతూ, ఏ కుక్క ఎటు తిప్పినా అటు శ్రధ్ధగా తిరుగుతూ మోకాలు విరక్కొనుటా ..యస్..యస్..ఈ ఏప్రిల్‌లోనే జరిగింది. "ఇంకొక నెల దాకా మీ కుక్కని వదిలిపెట్టేసి, ఈ క్రర కాలు పెట్టుకుని, విశ్రాంతి తీసుకో" అని మా ఎముకల డాక్టర్ సలహా పాటిస్తున్నాను.

అందు చేత కాలు విరగొట్టుకోడానికి అమ్మాయిల వెంట పడుటయే కాక ఇతర మార్గములు కూడా ఉన్నాయి సుమా అని నాకు అర్థం అయిపోయింది.

Post your comments